
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025





అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆ బ్యాక్టీరియాతో జాగ్రత్త

జిల్లాలో పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు

- గ్రామీణ ప్రాంతాల్లో జ్వరపీడితులపై నిఘా
- రక్త నమూనాల సేకరణ.. మచిలీపట్నం తరలింపు
- అనుమానితులకు వెంటనే చికిత్సకు ఆదేశాలు
- మచిలీపట్నం సర్వజనాసుపత్రిలో అన్ని ఏర్పాట్లు
- కలెక్టర్ బాలాజీ వెల్లడి



మచిలీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య మిగతా 6లో..

ఈ జాగ్రత్తలు పాటించాలి

పంటపొలాలు, గడ్డి, పొదలు ఉన్న ప్రదేశాల్లో పనిచేసే సమయంలో శరీరాన్ని పూర్తిస్థాయిలో కప్పి ఉంచేలా ప్యాంట్, చొక్కా, బూట్లు ధరించాలని కలెక్టర్ సూచించారు. దోమలు, పురుగు కాటుకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాత్రి సమయంలో తప్పనిసరిగా దోమతెరలను ఉపయోగించాలని, మూడు రోజులకు మించి జ్వరం ఉంటే, దద్దుర్లు లేదా చర్మంపై నల్లటిపూత (ఎస్కార్) కనిపిస్తే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని, స్క్రబ్ టైఫస్ ముందే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని పేర్కొంటున్నారు.

23 ఏళ్లుగా 2,500 కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న భారత్‌సాల్ట్ రిఫైనరీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ ఏడాదైనా పనులు ప్రారంభిస్తారా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మచిలీపట్నంలోని తీరప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క ఫ్యాక్టరీని మూసివేస్తే, తమకు ఉపాధి ఎలాగని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఈ ఫ్యాక్టరీలో ఈ ఏడాది పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉప్పు తిప్పలు



పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ

బందరులోని భారత్ సాల్ట్ కంపెనీపై తొలగని సందిగ్ధం

2022లో మూసివేసిన వైసీపీ ప్రభుత్వం

- 2,500 కుటుంబాల జీవనోపాధికి గండి
- పల్లెతుమ్మలపాలెంలో 23 ఏళ్లుగా ఉప్పు తయారీ
- ఈ ఏడాదైనా ప్రారంభమవుతుందని ఆశ
- డిసెంబరు వచ్చినా ప్రారంభంకాని పనులు
- ఫ్యాక్టరీని తెరిచి ఆదుకోవాలంటున్న స్థానికులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం సౌత్ మండలంలోని పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప రెవెన్యూ గ్రామాల పరిధిలో సముద్రానికి, సముద్ర కరకట్టకు మధ్యలో ఉన్న 6,500 ఎకరాలను ఉప్పు ఉత్పత్తి నిమిత్తం 2001, జూలై 28న భారత్‌సాల్ట్ రిఫైనరీస్ లిమిటెడ్‌కు లీజుకు ఇస్తూ నాటి టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భారత్‌సాల్ట్ రిఫైనరీస్ లిమిటెడ్ ద్వారా 23 ఏళ్లుగా ఇక్కడ ఉప్పు ఉత్పత్తి జరుగుతోంది. పల్లెతుమ్మలపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలోని 71 సర్వే నెంబరులో 5,100 ఎకరాలు, పోలాటితిప్ప గ్రామ రెవెన్యూ పరిధిలో 1,400 ఎకరాలను భారత్‌సాల్ట్ రిఫైనరీస్ లిమిటెడ్‌కు కేటాయించారు. ఈ ఫ్యాక్టరీలో ఏటా నవంబరు, డిసెంబరు నుంచి ఉప్పు ఉత్పత్తిని ప్రారంభిస్తారు. మే లేదా వర్షాలు కురిసే జూన్, జూలై వరకు ఇక్కడ ఉత్పత్తి చేపడతారు. ఉప్పు ఉత్పత్తి కోసం చేసే పనులతో పాటు తయారైన ఉప్పును ట్రాక్టర్ల ద్వారా రవాణా చేయడం, తదితర పనులను పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన పరిసర గ్రామాల ప్రజలు చేస్తున్నారు. ఈ మూడు గ్రామాలకు చెందిన వారే 100 ట్రాక్టర్లను కొని ఉప్పు రవాణా కోసం కిరాయికి తిప్పుతున్నారు. పురుషులు, మహిళలు 2,400 మందికిపైగా ఏడాదిలో ఆరు నుంచి ఏడు నెలల పాటు ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. 23 ఏళ్లుగా ఈ మూడు గ్రామాలకు ఏడాదికి రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లు ఫ్యాక్టరీలో పనిచేసే వారికి కూలీ, ఇతరత్రా రవాణా చార్జీల రూపంలో నగదు చేతికందుతోంది. దీంతో పాటు 150 లారీలు రోజూ ఉప్పును ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు రవాణా చేస్తూ ఉంటారు. ఈ ఫ్యాక్టరీలో 100 మందికిపైగా ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. 2,500 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న ఈ ఫ్యాక్టరీ లీజు గడువు ముగిసిందనే కారణంతో 2022లో నాటి వైసీపీ ప్రభుత్వం లీజును రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇక్కడ ఉపాధి పొందుతున్న మూడు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగటంతో ఏటా లీజును కొనసాగిస్తామని గత పాలకులు చెప్పారు. నాటి నుంచి ఈ ఫ్యాక్టరీ కొనసాగింపుపై గందరగోళం ఏర్పడింది.

ఆయిల్ రిఫైనరీకి భూములిస్తామని చెప్పి..

సముద్రానికి, సముద్రపు కరకట్టకు మధ్య ఉన్న భూముల్లో భారత్‌సాల్ట్ ఫ్యాక్టరీ ఉప్పును ఉత్పత్తి చేస్తోంది. కొంతకాలం క్రితం ఈ భూముల్లో ఆయిల్ రిఫైనరీని ఏర్పాటుచేసే ప్రతిపాదన చేశారు. ఇక్కడి భౌగోళిక పరిస్థితులను పరిశీలించిన సాంకేతిక నిపుణులు ఆయిల్ రిఫైనరీకి అనుకూలం కాదని నిర్ధారించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విండ్‌పవర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే టవర్లు నిర్మించేందుకు ఈ భూములు ఎంతమేర ఉపయోగపడతాయనే అంశంపై పరీక్షలు చేశారు. విద్యుత్ టవర్ల ఏర్పాటుకు ఈ భూములు అనుకూలంగా లేవనే కారణంతో సంబంధిత సంస్థ వెనక్కి వెళ్లిపోయింది. పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు పేరుతో ఈ భూములను చూపడం, కొన్ని సంస్థలు ఇక్కడి భూములను పరిశీలించి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా లేవని చెప్పి వెనుదిరగడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల సంభవించిన మొంథా తుఫాను ప్రభావంతో ఉప్పు ఫ్యాక్టరీలోని చెరువుల గట్లు కొట్టుకుపోయాయి. ఉప్పు ఉత్పత్తికి తప్ప, మరే ఇతర పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు చేయడానికి అవకాశం లేదని సాంకేతిక నిపుణుల చెబుతున్నారని స్థానిక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 23 ఏళ్లుగా 2,500 మందికి జీవనోపాధి చూపుతున్న భారత్‌సాల్ట్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది పనులు ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ముదునూరులో స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో యుగంధర్ (ఇన్‌సెట్‌లో) శివశంకర్‌రాజు (ఫైల్)

స్క్రబ్ టైఫస్ కలవరం

ఉయ్యూరు మండలం ముదునూరులో ఒకరి మృతి

- ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో పాజిటివ్‌గా నమోదు
- కిడ్నీ మరణమంటున్న కృష్ణాజిల్లా వైద్యాధికారి
- అధికారికంగా కృష్ణాలో 15, ఎన్టీఆర్‌లో రెండు కేసులు
- గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు 6

● గౌరవ వందనం



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మచిలీపట్నంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఏఎస్పీ వీవీ నాయుడు హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 8

భవానీ దీక్షల విరమణకు

పకడ్బందీ ఏర్పాట్లు

- సీవీ రెడ్డి ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నం
- దేవస్థానంలో ఖర్చులు తగ్గించేందుకు చర్యలు 6
- మరింత నాణ్యమైన లడ్డూ ప్రసాదం
- దుర్గగుడి చైర్మన్ బి.రాధాకృష్ణ

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మార్గంసుగమం

జిల్లావ్యాప్తంగా రహదారులకు మరమ్మతులు

- టెండర్లు ఆహ్వానించిన అధికారులు.. రూ.43 కోట్ల కేటాయింపు
- కొన్ని రోడ్లకు మరమ్మతులు, మరికొన్ని కొత్తగా నిర్మాణం



అధ్వానంగా ఉన్న విజయవాడ-అవనిగడ్డ కరకట్ట మార్గం

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించేందుకు మలివిడతగా రూ.43 కోట్లతో రోడ్లు భవనాల సంస్థ పనులు చేపట్టనుంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పలు రోడ్ల పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెలలోనే టెండర్లన్నీ ఖరారు కానున్నాయి. ఇటీవల మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడానికి తొలిదశలో కొన్ని టెండర్లు పిలిచారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో తాజాగా రెండోదశ పనులకు టెండర్లు పిలిచారు. రెండు జిల్లాలో ఉన్న పలు రోడ్లు, భవనాలను పరిశీలించి నిర్మాణం లేదా మరమ్మతులకు ఈ రెండోదశ టెండర్లు పిలిచారు. ఆయా రోడ్లు, భవనాల నిర్మాణాలకయ్యే ఖర్చుల వివరాలను అంచనా వేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.43 కోట్లతో ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

కృష్ణా జిల్లాలో..

కృష్ణాజిల్లాలో పాడైపోయిన రోడ్ల మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణానికి రూ.31.98 కోట్లు కేటాయిస్తూ టెండర్లు పిలిచినట్టు జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. పోరంకిలో బందరు కాల్వపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.21.96 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. నాగాయలంక-కోడూరు రోడ్డు, అవనిగడ్డ ఫ్లడ్ బ్యాంక్-అశ్వారావుపాలెం, నాగాయలంక- నాలి రోడ్ల అభివృద్ధికి రూ.3.58 కోట్లు కేటాయించారు. అలాగే ఎంవీ రోడ్డు (కోసూరు వయా నిమ్మకూరు, అవిరిపూడి), జీసీహెచ్‌కె రోడ్డు నుంచి నిమ్మకూరు రోడ్డు (వయా పోలవరం, అంబరపూడి, నిబాన్‌పూడి) అభివృద్ధి పనులకు రూ.2.47 కోట్లతో టెండర్లు పిలిచారు. నడుకూరు-వాడవల్లి, కోరుకొల్లు (స్టేట్ హైవే-310)లో 12 నుంచి 15వ కిలోమీటరు రాయి వరకు అభివృద్ధి చేయడానికి రూ.1.53 కోట్లు కేటాయించారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. వీటితో పాటు పీవీజీ రోడ్డు నుంచి ఇంతేరు వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం, చినపాండ్రాక నుంచి రంగారావుపేట గ్రామం వరకు రూ.కోటి కేటాయించారు. కౌతవరం, నిడుమోలు, ఇలనారు (రాష్ట్ర హైవే-253)ను రెండు కిలోమీటర్ల పొడవున నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.కోటితో టెండర్లు ఆహ్వానించారు. మిగతా 6లో..

మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్



మల్లవల్లి సీపీసీ.. లులుకు కేటాయింపు

కొత్త సంవత్సరంలో కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మెగా ఫుడ్ పార్కులో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) నిర్వహణను 'లులు' గ్రూపు అనుబంధ సంస్థకు ఏపీఐఐసీ అధికారులు ప్రాథమికంగా అప్పగించారు. పక్షం రోజుల కిందట లులు గ్రూపు సంస్థకు ఏపీఐఐసీ అధికారులు అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చారు. అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చిన 60 రోజుల్లో లులు గ్రూపు అద్దెను చెల్లించాలి. అద్దె చెల్లింపులు జరిగిన వెంటనే పూర్తిస్థాయిలో కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏపీఐఐసీ అధికారులు అప్పగిస్తారు. అద్దె ఇప్పటికిప్పుడు చెల్లించకపోయినప్పటికీ ప్రభుత్వం ఆదేశిస్తే పూర్తిస్థాయిలో అప్పగించే అవకాశాలు ఉన్నాయి. పాత కాంట్రాక్టర్‌తో సీపీసీకి ఉన్న లావాదేవీలు పూర్తిగా తెగిపోయాయి. ఆ కాంట్రాక్టు సంస్థతో సంప్రదింపులు జరిపి తాళాన్ని ఏపీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.70 కోట్లతో ఏపీఐఐసీ మెగా ఫుడ్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన కోర్ మిగతా 6లో..

ఆటలు, పాటల్లో నైపుణ్యం పెంచుకోవాలి
- కృష్ణాతరంగ్ ముగింపు ఉత్సవాల్లో కొనకళ్ల 8

గన్నవరం సీహెచ్‌సీ అభివృద్ధికి నిధులు
- ఫలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి 8

టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కన్నుమూత

పార్థివదేహం పిన్నమనేని వైద్య కళాశాలకు అప్పగింత

హే.. కృష్ణా!

కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ నిర్ణయంపై విమర్శలు

"కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ నిర్ణయం అన్నదాతలకు శాపంగా మారింది. పుష్కలంగా పులిచింతల ప్రాజెక్టులో నీరున్నా ఎత్తిపోతల పథకాలకు నికర జలాలను కేటాయించడంలేదు. దీంతో మిగులు జలాలతోనే నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా దినదిన గండంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ఆయకట్టు పంటల పరిస్థితి తయారైంది.

- పులిచింతల ప్రాజెక్టులో పుష్కలంగా నీరు
- ఎత్తిపోతల పథకాలకు నికర జలాల కేటాయింపులు నిల్
- మిగులు జలాలతోనే నిర్వహణ
- దినదిన గండంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ఆయకట్టు సాగు
- నీరందక సాగు మధ్యలోనే ఎండి పోతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



(ఆంధ్రజ్యోతి, నందిగామ): నికర జలాలు కేటాయించకుండా మిగులు జలాలతో ఎత్తిపోతల పథకాల నిర్వహణ దినదిన గండంగా మారింది. కృష్ణానదిపై ఎన్టీఆర్ జిల్లా వైపు సుమారు 24 ఎత్తిపోతల పథకాల ద్వారా 48 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. అత్యంత శక్తివంతమైన ఈ ఎత్తిపోతల పథకాలకు నీరు పుష్కలంగా అందితే ఆయకట్టులోని పూర్తి భూమిలో రెండు పంటలు పండించే అవకాశం ఉంది. కానీ నదీ ప్రవాహం తగ్గిన సమయంలో ఎత్తిపోతల పథకాలకు సక్రమంగా నీరు అందడం లేదు. ఫలితంగా సాగు మధ్యలో నీరు లేక పంటలు దెబ్బతింటున్నాయి. డెల్టా రైతుల అవసరాల కోసమంటూ పులిచింతల డ్యామ్ దగ్గర భారీగా నీటిని నిల్వ ఉంచుతున్నారు. ఎప్పుడో అవసరమొస్తాయని ఇప్పటి అవసరాలను అటకెక్కించి ఎన్టీఆర్ జిల్లాకు అన్యాయం చేయడం కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ అనాలోచిత నిర్ణయమని విమర్శలు వస్తున్నాయి. మొత్తం 48 వేల ఎకరాల సాగు అంటే సామాన్యమైన విషయం కాదు. కొద్ది పాటి డ్యామ్ ఆయకట్టుకు సమానమని గుర్తించాల్సి ఉంది. భవిష్యత్ కోసం ప్రణాళిక అవసరమే కానీ వర్తమానంలో రైతును నష్ట పరిచడం సరైన నిర్ణయం కాదన్న విమర్శలు వస్తున్నాయి.

43 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా..

గతంలో కేవలం పది టీఎంసీల నీటిని మాత్రమే డెల్టా అవసరాలకు నిల్వ ఉంచే వారు. కానీ ప్రస్తుతం 43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా సెంట్రల్ డివిజన్ అధికారులు నవంబరు మాసంలోనే పులిచింతల నీటిని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా వైపు పథకాలకు నీరు అందడం లేదు. పులిచింతల నుంచి మార్చి నెలాఖరు వరకూ నీరు విడుదల చేస్తేనే ఆయకట్టు రైతులు ఒడ్డున పడతారు. అప్పటి వరకూ నీరు విడుదల చేసినా పులిచింతలకు, డెల్టాకు వచ్చే నష్టం లేదు. నిరంతరాయంగా నీటిని విడుదల చేసినా పది టీఎంసీలు కూడా ఖర్చు కాని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో ప్రభుత్వం స్పందించి దీనిపై సమీక్ష నిర్వహించి పులిచింతల నుంచి ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేయించాల్సి ఉంది. జలవనరులను కాపాడుకోవడమంటే అనవసరంగా నిల్వ ఉంచడం కాదని, సమర్థవంతంగా సాగుకు వినియోగించుకోవడమన్న విషయాన్ని అధికారులు గుర్తించాల్సి ఉంది. కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా పంట పొలాలకు అందించే విధంగా ప్రభుత్వాలు అనుమతులు, నిధులు ఇచ్చి నిర్మించాయి. కానీ ఆ పథకాలకు నికర జలాలు కేటాయించకపోవడం నిర్లక్ష్యంగా భావించాల్సి ఉంది. కేవలం నదిలో నీరున్నప్పుడే వినియోగించుకోవడమంటే ఆ ఆయకట్టును వర్షాధార ఆయకట్టుగానే భావించాల్సి ఉంటుంది. వర్షాలు పడే సమయంలో ఆయకట్టుకు కృష్ణానది నీరు పెద్దగా అవసరం ఉండదు. వర్షాలు వెనకేసిన తర్వాత నదిలో నీరుండదు. అవసరమైన సమయంలో నదిలో నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. కనుక ఆయకట్టు స్థిరీకరణకు స్థిరమైన నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంది. ఇందు కోసం మార్చి నెలాఖరు వరకూ నిరంతరం మూడు వేల క్యూసెక్కుల నీటిని పులిచింతల డ్యామ్ నుంచి విడుదల చేయాల్సి ఉంది.

గోదావరి ఉండగా ఎందుకు ఆందోళన?

డెల్టా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మెట్ట ప్రాంత రైతులను ఇబ్బంది పెడుతున్న కృష్ణా సెంట్రల్ డివిజన్ అధికారులు మితిమీరిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పులిచింతల నీటి మట్టం నాలుగో శాతం ఉన్నా డెల్టా అవసరాలకు సరిపోయే అవకాశం ఉంది. దీనికి తోడు ఎప్పుడు కావాలంటే అప్పుడు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చే అవకాశం ఉంది. డెల్టా రైతాంగం కోసం క్షణం కూడా ఆలోచన చేయాల్సిన పని లేని నేపథ్యంలో మెట్ట రైతుల అవసరాలను అడ్డుకోకుండా అధికారులు, పాలకులు స్పందించి పులిచింతల నీటిని కేటాయించాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు స్పందించి పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించం ద్వారా ఎత్తిపోతల పథకాల ఆయకట్టును ఆదుకోవాల్సి ఉంది. వనరులు ఉన్నా వడ్డించే వారు లేక అల్లాడుతున్న మెట్ట రైతుకు అండగా నిలవాల్సి ఉంది. పులిచింతల నీటిని నిరంతరం పథకాలకు అందించేందు గాను ఎన్టీఆర్ జిల్లా వైపు కృష్ణానదిలో కాలువ తీసి పటిష్టంగా లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఆలా చేపడితే నీరు కూడా వృథా కాకుండా కొద్దిపాటి నీటితోనే ఎత్తిపోతల పథకాలు పూర్తి సామర్థ్యంతో ఆయకట్టుకు నీరందించగలుగుతాయి. దీంతో రైతుల జీవన ప్రమాణాలు పెరిగి కూటమి ప్రభుత్వం ఆశించిన విధంగా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది.

ఏడు వరాలను సద్వినియోగం చేసుకోవాలి

- విజువల్లీ చాలెంజ్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి రవీంద్రబాబు
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సభ



మాట్లాడుతున్న రవీంద్రబాబు, వేదికపై వివిధ రంగాల ప్రముఖులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించిన ఏడు వరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని విజువల్లీ చాలెంజ్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి రవీంద్రబాబు పిలుపునిచ్చారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శుభం కన్వెన్షన్ హాలులో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. దివ్యాంగులను ఎవరైనా కించపరుస్తూ మాట్లాడితే ఐదేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తారన్నారు. గత వైసీపీ పాలనలో దివ్యాంగులను విస్మరించారన్నారు. దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.హేమలత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామరాజు, కైకలూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లాడ శ్రీనివాసరావు, శిరీష రిహాబిలిటేషన్ డైరెక్టర్ మన్నె అనూష, స్టార్ విద్యా సంస్థల అధినేత పి.శ్రీరాం, న్యాయవాది అజ్మతున్నీసా, రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ ఈశ్వర్, మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలు గోవాడ ప్రశాంతి, మైత్రి ఫౌండేషన్ ప్రతినిధి కె.వేణుకుమార్, రిటైర్డు సీఐ సాయిస్వరూప్, నూర్జహాన్ తదితరులు మాట్లాడారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో ప్రముఖులు


మధుసూదనరెడ్డికి స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు

మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర లాం అండ్ ఆర్డర్ అదనపు డీజీ ఎన్.మధుసూదనరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు శనివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందించారు.

స్క్రబ్ టైఫస్ కలవరం

విజయవాడ/ఉయ్యూరు/గుడ్లవల్లేరు/కంచికర్ల రూరల్/జి.కొండూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ ఉమ్మడి కృష్ణాజిల్లాను కలవరపెడుతోంది. కృష్ణాజిల్లాలో 15 కేసులు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. ఇవికాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్క్రబ్ టైఫస్ బారిన పడి ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకర్‌రాజు (42) ఈనెల 4న మృతిచెందడం కలకలం రేపుతోంది. జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న ఆయన మచిలీపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. లక్షణాలను బట్టి పరీక్ష చేయగా, స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని వచ్చింది. దీంతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం (ఐహెచ్ఐపీ) పోర్టల్‌లో రాజుకు పాజిటివ్ వచ్చినట్టుగా అప్‌లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న కృష్ణాజిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.యుగంధర్ శనివారం సాయంత్రం ముదునూరులోని మృతుడు శివశంకర్‌రాజు ఇంటికి వెళ్లారు. అతని కుటుంబసభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధితో శివశంకరరాజు బాధపడుతున్నట్లు తమ విచారణలో తేలిందని, దీనివల్లే ఆయన మృతిచెందినట్లు నిర్ధారణకు వచ్చామని వెల్లడించారు. పేడపురుగు కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి వస్తుందని, కానీ చనిపోయే అవకాశాలు చాలా తక్కువని తెలిపారు. మందులు వాడితే తగ్గిపోతుందన్నారు.

గుడ్లవల్లేరులో రెండు కేసులు

గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారి యశస్వినీ శనివారం తెలిపారు. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన మానస, పామర్రుకు చెందిన అమలేశ్వరి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యంతో వచ్చారని, రక్త నమూనాలను సేకరించి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా, స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నమోదైందన్నారు. ఇద్దరికీ చికిత్స అందిస్తున్నామని, ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

కంచికచర్లలో ఒక కేసు

నందిగామ నియోజకవర్గ పరిధిలోని కంచికచర్లలో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మహిళ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కంచికచర్లలో ఆ మహిళకు స్క్రబ్ టైఫస్ సోకినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు రావడంతో జిల్లా వైద్యాధికారులు స్పందించారు. కంచికచర్ల ఇందిరా కాలనీకి చెందిన మహిళ ఈనెల 3న జ్వరంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు 5న పరీక్షలు నిర్వహించగా, స్క్రబ్ టైఫస్ అని వైద్యులు గుర్తించారు. సమాచారాన్ని కంచికచర్ల పంచాయతీ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టారు. మహిళా నివాసిత ప్రాంతంలో బ్లీచింగ్ సున్నం పిచికారీ చేశారు.

జి.కొండూరులో ఒక కేసు

జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సంకటి రాకేశ్ అనే రెండున్నరేళ్ల బాలుడికి స్క్రబ్ టైఫస్ సోకింది. ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. రాకేశ్ ఆరు నెలల నుంచి మైలవరం మండలం పొందుగల గ్రామంలో నానమ్మ ఇంటి దగ్గర ఉంటున్నాడు. వారం క్రితం బాలుడికి తీవ్ర జ్వరం రావడంతో మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి అనంతరం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక పరీక్షలో స్క్రబ్ టైఫస్ అని తేలింది. బాబు శరీరంపై మచ్చలు కానీ, గాయాలు కానీ లేకపోవడంతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి పరీక్ష కోసం బాలుడి రక్త, మూత్ర శాంపిల్స్ పంపారు. నాలుగు రోజుల తర్వాత చెబుతామని వైద్యులు చెప్పారని బాలుడి తల్లి తెలిపింది.

మల్లవల్లి సీపీసీ.. లులుకు కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

ప్రాసెసింగ్ సెంటర్‌ను నూతన సంవత్సరంలో లులు అనుబంధ గ్రూప్ నిర్వహించనుంది. లులు నిర్వహణలో ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల ప్యాకింగ్‌తో పాటు పల్ప్ తయారీ, వాటి ప్యాకింగ్ ఇక్కడ చేపడతారు. అలాగే, లులు తన సొంత ఆర్డర్లపై పల్ప్, ప్యాకింగ్ వంటివి చేపడుతుంది.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

- అంకిత భావంతో పనిచేస్తున్న సీఎం చంద్రబాబు
- బందరు పోర్టు నిర్మాణంతో పాటు పలు పరిశ్రమల రాకకు అవకాశాలు
- ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్ర


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు అంకితభావంతో పనిచేస్తున్నారని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు రోగులు, దివ్యాంగులు వినతులు ఇచ్చారు. ఇళ్లు, ఇళ్లస్థలాలు, పింఛన్లకు పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మీడియతో మాట్లాడారు. బందరు పోర్టు నిర్మాణంతో పాటు మచిలీపట్నంకు పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించేందుకు కార్పొరేట్ కంపెనీలు తరలివస్తున్నాయన్నారు. ఆరు వేల ఇళ్ల నిర్మించాలనే లక్ష్యానికి ఇచ్చిన హామీలో భాగంగా టిడ్కో ఇళ్లతో పాటు ఇతరత్రా ఇళ్ల మంజూరు చేశామన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పేదల ఇళ్ల నిర్మాణాన్ని గాలికొదిలేశారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికి 2,264 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 90 శాతం పరిష్కరించామన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల స్థితిగతులను తెలుసుకున్నామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అమ్మిన 24 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. బందరు పోర్టు నిర్మాణంతో పాటు పలు పరిశ్రమలు స్థాపించేందుకు పెద్ద ఎత్తున కార్పొరేట్ కంపెనీలు ముందుకు వస్తున్నా యన్నారు. చిన్నాపురం-కమ్మవారిచెరువు రోడ్డును ప్రారంభిస్తామన్నారు. మూడు స్తంభాల నుంచి కోనేరు సెంటర్ వరకు రూ.2 కోట్లతో రోడ్డును విస్తరిస్తున్నామని చెప్పారు. రూ.10 కోట్లతో కొత్త రోడ్లు నిర్మిస్తున్నా మన్నారు. బందరు కోట, గరాలదిబ్బ, పోలాటితిప్పలోని వంతెన నిర్మాణానికి రీ ఎస్టిమేట్లు వేశామన్నారు. మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైన్‌పై కేంద్ర మంత్రులతో మాట్లాడామని, డీపీఆర్ తయార యిందని తెలిపారు.

దొంగలను వెనకేసుకొస్తున్న జగన్‌రెడ్డి

మాజీ సీఎం జగన్‌రెడ్డి ఎంపిక చేసుకున్న నలుగురు జర్నలిస్టులను పిలిపించుకుని నాలుగు గోడల మధ్య నాలుగు గంటల సేపు ప్రెస్‌మీట్ పెట్టారని, ఆ ప్రెస్‌మీట్‌లో దొంగలు, ఖూనీకోరులను వెనకేసుకొచ్చారని విమర్శించారు. తిరుమల వెంకటేశ్వరస్వామి వారి సొమ్మును కొట్టేస్తే అది చిన్న దొంగతనం అనడం విడ్డూరమన్నారు. కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలు తీసిన నిందితుడిని అమాయకుడు అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గంజాయి స్మగ్లర్లను చిన్నపిల్లలంటూ మాట్లాడుతున్నారన్నారు. జగన్‌రెడ్డి హయాంలో చేసిన అరాచకాలు, ఆకృత్యాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం

- రాజ్యాంగ నిర్మాత వర్ధంతి సభలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ నెరవేరుద్దామని గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి శనివారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి రవీంద్ర, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాల మేరకు అందరూ పనిచేయాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఉపకులపతి కూన రాంజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అంబేడ్కర్ చిత్రపటానికి సూపరింటెండెంట్ ఆశాలత పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

భవానీ దీక్షల విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

- సి.వి.రెడ్డి ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నం
- దేవస్థానంలో ఖర్చులు తగ్గించేందుకు చర్యలు
- మరింత నాణ్యమైన లడ్డూ ప్రసాదం
- దుర్గగుడి చైర్మన్ బి.రాధాకృష్ణ


మాట్లాడుతున్న చైర్మన్ రాధాకృష్ణ, చిత్రంలో ఈవో శీనానాయక్, పాలకవర్గ సభ్యులు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ తెలిపారు. శనివారం వన్‌టౌన్ బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలోని దేవస్థానం కార్యాలయంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. పలు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అనంతరం ఈ.వో శీనా నాయక్‌తో కలిసి మీడియాతో చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడారు. భవానీ దీక్ష విరమణల ఏర్పాటుకు పెద్ద ఎత్తున భవానీలు, సాధారణ భక్తులు రానున్నట్లు తెలిపారు. చివరి రెండు రోజుల్లో పెద్ద ఎత్తున భవానీలు వచ్చే అవకాశం ఉందన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతుందని చెప్పారు. గత పదేళ్లుగా సుమారు 50, 60 మంది రిటైర్ అయ్యారని, ఆ పోస్టులు భర్తీకాకపోవటం ఇబ్బందికర పరిస్థితి ఉందన్నారు. భక్తుల తాకిడి పెరగటం వలన కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నామని, భక్తుల నుంచి కూడా అభిప్రాయలు తీసుకుంటున్నామని తెలిపారు. దేవస్థానంలో ఖర్చులు తగ్గించటానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మంచినీటి సరఫరాకు ఎక్కువ ఖర్చు అవుతుందని దేవస్థానమే వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. వాహనాల్లో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 500 కార్లు పార్కింగ్ చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో నష్టం వచ్చినప్పటికీ ఇంకా నాణ్యమైన లడ్డూ ప్రసాదం అందిస్తామని చెప్పారు. దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాలపై సమావేశంలో చర్చించామని, వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే దాని పై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దుర్గాఘాట్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వ్యాపారస్తులు భక్తుల నుంచి అధిక రుసుము వసూలు చేయకుండా ఉండేందుకు ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులకు సూచించినట్లు చెప్పారు. దేవస్థానం పాలక మండలి దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు సేవలు అందించటానికి పూర్తిగా సపోర్టు చేస్తుం దని, అందుకుగాను ఆలయ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ ప్రసాదం తయారీ భవనం, అన్నదాన భవనాలను ఆరు నెలల్లో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు మరో 100 మంది సిబ్బందిని నియమించవలసి ఉందని తెలిపారు. ముఖ్యంగా భవానీ దీక్షల విరమణల అనంతరం దేవస్థానం అభివృద్ధిపై భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. ఆలయ ఉద్యోగులు భక్తుల పట్ల మర్యాదగా మాట్లాడేవిధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను సీవీరెడ్డి ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు బోర్డు సభ్యులతో చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

ఆ బ్యాక్టీరియాతో జాగ్రత్త

(5వ పేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ ఈ కేసుల నమోదును నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 12 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఇవి కూడా వ్యవసాయ పనులు చేస్తున్నవారు, జ్వరం బారినపడిన వారిలోనే గుర్తించామని తెలిపారు. వ్యాధి నివారణ కోసం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నామని ఆయన వివరించారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒరియంటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల సోకే వ్యాధి అని, పొలాలు, పొదలు, గడ్డి అధికంగా ఉండే ప్రదేశాల్లో ఉండే సంక్రమిత చిగర్‌మైట్ కాటు ద్వారా, పిల్లి, ఎలుక వంటి పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి బారినపడిన వారికి 6-21 రోజుల్లోపు (సరాసరి 10-12 రోజుల్లో) జ్వరం మొదలవుతుందని, అధికజ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులు, అలసట, కొందరిలో దద్దుర్లు, పురుగులు కుట్టినచోట నల్లటి స్పాట్ల వంటి లక్షణాలు కనిపిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

రక్తనమూనాల సేకరణ

జిల్లాలోని అన్ని ఆసుపత్రులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో జ్వరం కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టి, బాధితుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిని పరీక్షల నిమిత్తం సర్వజనాసుపత్రికి పంపుతున్నట్లు పేర్కొన్నారు. స్క్రబ్ టైఫస్ సోకినట్లుగా అనుమానం కలిగిన రోగులకు వెంటనే చికిత్స అందించాలని వైద్యులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్ తదితర మందులను అందుబాటులో ఉంచి, నిర్ధారణ పరీక్షలు వెంటనే చేసేలా సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. వైద్యశాఖ సిబ్బంది ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు స్క్రబ్ టైఫస్ లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)


ఈ రోడ్ల నిర్మాణాలతో పాటు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో దిశ వన్‌స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.44 లక్షలు కేటాయించినట్టు ఆర్ అండ్ బీ అధికారులు వెల్లడించారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పలు రోడ్ల మరమ్మతులు, నిర్మాణానికి రూ.11 కోట్లు కేటాయించినట్టు జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. విజయవాడ-విస్సన్నపేట రోడ్డు (రాష్ట్ర హైవే-32) అభివృద్ధి పనుల కోసం రూ.3 కోట్లు కేటాయించినట్టు జిల్లా ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. మచిలీపట్నం-నూజివీడు, కల్లూరు (ఎంఎన్‌కే) రోడ్డు మరమ్మతుల కోసం రూ.2.91 కోట్లు, జగ్గయ్యపేట నుంచి షేర్‌మహ్మద్‌పేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.71 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. విజయవాడ-విస్సన్నపేట రోడ్డు (రాష్ట్ర హైవే-30) మరమ్మతులకు రూ.2.38 కోట్లు కేటాయించినట్టు అధికారులు వెల్లడించారు.

డిజిటల్ అరెస్టు మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి


జ్యోతి వెలిగిస్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

లబ్బీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సూచించారు. బందర్ రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో శనివారం ఆసరా ఏడవ జాతీయ సమ్మిట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ఆధునిక యుగం లో సైబర్ నేరాలు పెరిగి సామాన్య ప్రజలు తీ వ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలు జరుగుతు న్నాయని, కానీ అసలు డిజిటల్ అరెస్టు అనే వ్యవస్థ లేదని పేర్కొన్నారు. సైబర్ వలలో ప్రజలు చిక్కుకోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వినియోగ దారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు పని చేస్తున్నా యన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళుల ర్పించారు. సుప్రీంకోర్టు న్యాయ వాది, అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సి బిలిటి అండ్ అవేర్‌నెస్ ప్రతినిధి హబీబ్ సుల్తాన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

కామధేనులో సెమీక్రిస్మస్ వేడుక



కేక్ కట్ చేస్తున్న చలసాని అంజనేయులు తదితరులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ) ఆవరణలో శనివారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు. కుల,మత, వర్గ విభేదాలు లేకుండా సేవాభావంతో మెలగాలన్నారు. పాడిరైతు కుటుంబాలు, వినియోగదారు లందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి, అభయాంజనేయస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి



బాపులపాడులో మల్లిర్జునస్వామికి పూజలు చేస్తున్న జ్యోతిర్మయి దంపతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హైకోర్టు జడ్జి వెంకటజ్యోతిర్మయి శనివారం బాపులపాడు, హనుమాన్‌జంక్షన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వారకాతిరుమల వెళ్లేక్రమంలో బాపులపాడులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల బ్రహ్మసూత్ర మరకత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులకు అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. దంపతులకు స్వామి వారి శేషవస్త్రాన్ని, అమ్మవారి కుంకుమతో నూతన వస్త్రాలను అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ప్రాశస్త్యాన్ని గురించి కమిటీ సభ్యులు వివరించారు. సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్య, కొల్లి వెంకట్రావు, గొట్టిపాటి రాంబాబు, గూడపాటి రత్నశేఖర్, తమరి రమేష్ తదితరలు పాల్గొన్నారు. తదనంతరం హనుమాన్‌జంక్షన్ కూడలిలోని అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎస్సై సురేష్ పర్యవేక్షించారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

దీర్ఘకాలిక వ్యాధులపై పరిశోధనలు పెరగాలి

ప్రసాదంపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులపై పరిశోధనలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ అధినేత డాక్టర్ రాజీవ్ దహియా విద్యార్థులకు సూచించారు. ఎనికేపాడులోని విజయ ఫార్మసీ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, అసియేసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ కొరియన్ అంతార్జతీయశాఖ 14వ వార్షిక అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. నూతన ఔషధ ఆవిష్కరణలు, అభివృద్ధి, భవిష్యత్ సవాళ్ల అంశంపై రెండు రోజులపాటు సదస్సు నిర్వహించారు. వేల్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ కార్తికేయన్ మాట్లాడుతూ కృత్రిమ మేధా సాధనాలు ఔషధ, వైద్య రంగంలో వినియోగిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ అర్చన మెహరోత్ర, చాణక్య ఎడ్యుకేషనల్ హబ్ నుంచి డాక్టర్ వెంకట్ ఇక్కుర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలత, ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ - నూజివీడు రహదారి పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హనుమాన్‌జంక్షన్ నుంచి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారిపై గోతులను ఏపీఎస్ఆర్టీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ శనివారం పరిశీలించారు. ఆర్వోబీపై పడిన గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రక్షణ గోడ ఇప్పటికి ప్రమాదాలు జరిగి మూడుసార్లు సర్వీస్ రహదారిపై పడిపోయిందని స్థానికులు తెలిపారు. ఆసమయంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిందన్నారు. సర్వీస్ రోడ్డులో రైతులు, రైల్వే ప్రయాణికులు ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. తక్షణ మరమ్మతులు చేస్తామని శివశంక్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుంకర సాంబ శివరాయల్, గిరి తదితరుల పాల్గొన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

పెనమలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకి కార్మికనగర్ కట్ట ప్రాంతానికి చెందిన జోగి నాయుడు(25) పాలరాయి పనులు చేసి జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడు తన భార్యతో గొడవలు పడుతుండగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన జోగినాయుడు ఈనెల 3న ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగాడు. బంధువులు గమనించి అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముస్తాబాద పేడచెరువులో కోళ్ల వ్యర్థాలు

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద పేడ చెరువులో వేస్తున్న వ్యర్థాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువును చేపలు పెంచేందుకు లీజుకు తీసుకున్న వారు కోళ్ల మేతతో పాటు ఇతర వ్యర్థాలు వేస్తున్నారు. ఎన్నిమార్లు చెప్పిన పట్టించుకోవటం లేదని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాటిబండ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. పంట పొలాలకు వినియోగించే నీటిలో వ్యర్థాలు, ఇతర మందులు ఇష్టానుసారంగా వేయటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పీబీ సిద్ధార్థలో ముగిసిన సదస్సు

విజయవాడ: పీబీ సిద్ధార్థ కళాశాల వృక్ష జంతు జీవ సాంకేతిక విభాగాలు, శ్రీచైతన్య సరస్వత్ మఠ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న సదస్సు శనివారంతో ముగిసింది. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎంవీ జగన్నాథం మాట్లాడుతూ సైన్స్ ప్రకృతిపై పెత్తనం చేస్తే ,వేదాంతం ప్రకృతిలో తాను భాగం అంటుందని తెలిపారు. మఠ్ అధ్యక్షుడు డాక్టర్ లీలా భక్తి నిష్కామ శాంత మహరాజ్ మాట్లాడుతూ జీవం పుట్టుక సైన్స్‌కు అందదని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు పాల్గొన్నారు.

పదేళ్ల కల సాకారం

రూ. 4.10 కోట్లతో ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడె శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన మాజీ ఎంపీపీ దేవినేని రాజా తదితరులు

కంకిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ డ ు పు గ ల్లు గ్రామస్థుల పదేళ్ల కల నెరవేరిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రూ. 4.10 కోట్లతో చేపట్టిన ఈడుపుగల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి 2014 - 19లో ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారిపోవడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ అభివృద్ధి చేయకపోగా వినాశనం చేసిందన్నారు. ఆర్‌అండ్‌బీ నిధులు రూ. 3.50 కోట్లు కేటాయించగా కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మండల పరిషత్ నిధులు రూ.60లక్షలు కేటాయించటం అభినందనీయమన్నారు. రహదారికి సహకరించిన డీఈ బలరామ్‌ను మాజీ ఎంపీపీ దేవినేని రాజ, సర్పంచ్ పందిపాటి ఇందిర ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, కూటమి నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుధాకర్, రవికిషోర్, షేక్ షకార్, అనుమోలు రామకృష్ణ, ఉపసర్పంచ్ కిలారు శ్రీను పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య రంగాపాలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కాటూరులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 60లక్షలతో చేపట్టిన రక్త పరీక్ష కేంద్రానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వస్తున్న పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ.ఎస్.టీ.శేషగిరి రావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి...

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లులో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా దర్బార్‌లో ప్రధానంగా పింఛన్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, తహసీల్దార్ భవన్నారాయణ, విద్యుత్ శాఖ ఏఈ అశోక్, వ్యవసాయ శాఖ అధికారి ఉషారాణి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎస్టీయూ మండల కమిటీ

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎంపీపీ పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎం.ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ఆనంద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఏఐ ఎస్టీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డీఎస్ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కె.వెంకటరత్నం పరిశీలకులుగా వచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేయాలన్నారు.

వాహనాల తొలగింపు

ప్రసాదంపాడు: రామవరప్పాడు రింగ్‌లోని అంజనేయస్వామి గుడిపక్కన ట్రాఫిక్ పోలీసులు సీజ్‌చేసిన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు శనివారం పోలీసులు తొలగించారు. వాహనాలు తుప్పుపట్టి ఉండడం గమనించిన ఎమ్మెల్యే వాటిని తొలగించాలని పోలీసులకు సూచించారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గౌరవ వేతనం ఇవ్వరా..?

బాపులపాడు మండల సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం మంజూరులో జాప్యంపై నిలదీశారు. సభ్యుల ప్రశ్నలతో బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ యరగొర్ల నగేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాగునీటిపై, వ్యవసాయశాఖ, సర్వజనాసుపత్రి నిర్మాణం తదితర సమస్య లపై అధికారులను సభ్యులు నిలదీశారు. వేసవికాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య గుర్తించి ఓవర్‌హెడ్ ట్యాం కుల నిర్మాణం, మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మడిచర్లకు చెందిన డీసీ చైర్మన్ సత్యనా రాయణ మాట్లాడుతూ ఆర్బీకేసేవలందడం లేదన్నారు. వీఏఏ రైతులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఏవో రంగనాథ్‌బాబు స్పందిస్తూ ధాన్యం సేకరణ త్వరితగతిన చేసేందుకు వీఏఏలను పంపించామని, రేమల్లె వీఏఏ ఇంచార్జిగా వ్యవహరిస్తూ రైతులకు అందుబాటులో ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. బాపులపాడు మండలంలో పీహెచ్‌సీ నిర్మాణం సగంలో ఆగిపోవడంపై సభ్యులతో పాటు ఎంపీపీ నగేష్ కూడా అసహనం వ్యక్తం చేశారు. ఎంత నిధులు కావాలి, ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. కొంత మేరకు నిధుల విడుదలయ్యాయని, త్వరలోనే పనులు మొదలు పెట్టి పూర్తయ్యేలా చూస్తామని ఎంపీడీవో జోగేశ్వరరావు సమాధానమిచ్చారు. ఎంపీటీసీ సభ్యుల గౌరవవేతనంపై ప్రశ్నించగా త్వరలోనే అందజేస్తామని ఎంపీడీవో వివరించారు. తన పొలంలో ఎవరికీ తెలియజేయకుండా విద్యుత్‌శాఖ లైన్లు వేయడం అమానుషమని కోఆప్షన్ సభ్యుడు షేక్‌తానీషా ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

2.6 టన్నుల బియ్యం స్వాధీనం

పెనమలూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కానూరు సనత్‌నగర్ వద్ద పెనమలూరు పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఎస్సై రమేష్ శనివారం తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వ్యాన్ వేగంగా దూసుకెళ్లడం గమనించి తన సిబ్బందితో ఆపించి తనిఖీ చేశారు. వ్యాన్‌లో 52తెల్లటి బస్తాల్లో 2,600కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొన్నారు. వ్యాను డ్రైవరు మోదురి ప్రతాప్‌ను పోలీసులు ప్రశ్నించగా కోళ్ల దాణా కోసం బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి పామర్రు, కంకిపాడు గ్రామాల్లోని కోళ్ల ఫారాల యజమానులకు అధికధరలకు విక్రయిస్తానని తెలిపాడు. అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ప్రతాప్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి దిచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. వీరవల్లిలో జాతీయరహదారిపై శనివారం అవగాహన కల్పిచారు. తలకు తీవ్రగాయమై సరైన సమయంలో(గోల్డెన్ హవర్స్)చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాల్లో తలగాయాల నుంచి రక్షించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రహదారి నియమావళి పాటిస్తూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని సూచించారు. మైనర్లకు వాహనాలిచ్చినా చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాంబశివరావు



ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నికైంది. ఒక సెట్ మాత్రమే నామినేషన్‌లు దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నగేష్‌బాబు తెలిపారు. అధ్యక్షుడిగా వి.సాంబశివరావు, కార్యదర్శిగా కె.సంపత్‌కుమార్, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా సీవీఎల్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖరరావు, ఎ.సునీల్‌కుమార్, ఎస్.శ్రీనివాసు, సహాయ కార్యదర్శిగా సీహెచ్ నాగపద్మావతి తదితరులతో కలసి 11మందితో కార్యవర్గం ఏర్పడింది. తూర్పు కృష్ణ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాస్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, రత్నబాబు, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శోభన్‌బాబు, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు



డిపో మేనేజర్ శివాజీకి ప్రశంసాపత్రం అందజేత

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే సంస్థకు లాభాలు వస్తాయని ఆర్టీసీ ప్రజారవాణా అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీ డిపోలో శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీరో బ్రేక్ డౌన్స్ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రయాణికుల సంతృప్తి మేరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. డిపోలో ఎటువంటి బ్రేక్ డౌన్స్ లేకుండా పని చేసినందుకు డిపోకు ఆర్టీసీ ఎండీ పంపిన ప్రశంస పత్రాన్ని డిపో మేనేజర్ శివాజీకి అందజేశారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి



తాడిగడప సెంటరులో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

పెనమలూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కానూరు, పోరంకి, యనమలకుదురు, పెనమలూరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రమానికి టీడీపీ కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనుమోలు ప్రభాకరరావు, కొండా ప్రవీణ్, ఎస్సీ సెల్ నాయకులు విప్పర్ల రవికుమార్, చనమాల జోజికుమార్, పొనుగుమాటి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ వేర్వేరు కార్యక్రమాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపులపాడు

ఉంగుటూరు: యువత బి.ఆర్.అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆశయాల సాధనకు పాటుపడాలని మాలమహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంతోని పిలుపునిచ్చారు. ఉంగుటూరులో విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ధరణికోట సూర్యప్రకాష్, అమర్తల తేజ, జీవన్, పండు, గుండె కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత పని చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. టీడీపీ కార్యాలయంలో చిట్టూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జంపన వెంకటేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



హార్నమెంటల్ బనానా

ఫల పుష్ప శోభితం



● ఆకట్టుకుంటున్న రోజ్ సొసైటీ ఫల పుష్ప ప్రదర్శన ● అందుబాటులో దేశ, విదేశాల మొక్కలు ● విభిన్న మొక్కలకు ఒకటే వేదిక



బ్రొమిలియార్డ్



సీతమ్మవారి జడ



రుద్రాక్ష



తెల్ల సంపంగి


ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: సువాసనలు వెదజల్లే తెల్ల సంపంగి, ఇంటికి అందం తీసుకొచ్చే సీతమ్మ వారి జడ, బోన్సాయ్, లిప్‌స్టిక్ మొక్కలు, ఆరోగ్యాన్నిచ్చే ఆర్గానిక్ మొక్కలు, ఆకట్టుకునే స్టోన్ ఆర్ట్ వీటన్నింటికీ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ మైదానం వేదికైంది. నగరంలోని పాలిక్లినిక్ రోడ్డులో ఉండే ఈ మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ ఏర్పాటు చేసిన పుష్ప, ఫల, గృహ అలంకరణ మొక్కల ప్రదర్శన ప్రజలను అమితంగా ఆకర్షిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పచ్చదనం, సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన కొనసాగుతోంది. థాయ్‌ల్యాండ్, డార్జిలింగ్, కడియం, కాకినాడ, తమిళనాడు, కేరళ, పూణె, బెంగళూరు, భీమవరం, విజయవాడ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన నర్సరీల మొక్కలు ఇక్కడ అందుటుబాటులో ఉంచారు. 46 స్టాల్స్‌లో పూలమొక్కలు, 20 స్టాల్స్‌లో ఆర్గానిక్ ఆకుకూరల, కూరగాయల మొక్కల ఏర్పాటు జరిగింది. రుద్రాక్ష, సీతమ్మవారి జడ, టెకీకూహిల్, మంకీస్ టెయిల్, హార్నమెంటల్ బనానా, సన్‌సెట్ క్రీపర్, గోల్డ్ చైన్, స్పోటోడియమ్, తెల్ల సంపంగి, మండవెల్లి, లిప్‌స్టిక్, కాలా లిల్లీ, కుర్‌కుమ, కొల్లస్‌మన్, ఫైరకాంతార, కాక్టస్, సక్యులెన్స్, ఓల్డ్‌మెన్, గుంటూరు ఆర్గానిక్ కారపొడులు, కందులు, మినుము, తోటకూర, ఉలవలు, మొంతుల మైక్రో మొక్కలు, లిషియంతాస్, ఏసియాటిక్ లిల్లీ, బ్రొమిలియార్డ్, లెమన్, లైట్ వంగ, కర్పూరం, దాలియాస్, అన్నపూర్ణ మొక్క, పాండావతు, లెమన్‌షైన్, మిర్చీ, బోన్సాయ్, మందారం, గులాబీ, మల్లె, సన్నజాజి తదితర వందల రకాల మొక్కలు అందుబాటులో ఉంచారు. జైపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన స్టోన్ ఆర్ట్ స్టాల్ ఈ ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రపంచంలో లభించే అన్ని రకాల రాళ్లతో తయారు చేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంది. ఈ నెల 8వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకురాలు పద్మప్రియ తెలిపారు. వన్ లైఫ్, వన్ ఎర్త్ పేరుతో ప్రత్యేకంగా ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భూమి ఆరోగ్య కాపాడటంలో మొక్కల పాత్ర అనే అంశాలపై రోజూ ఒక్కో థీమ్‌తో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు.



కొండ రాళ్లతో తయారు చేసిన కుండీలు



కొల్లస్‌మన్







సందర్శకులతో కళకళలాడుతున్న రోజ్ సొసైటీ ఫల, పుష్ప ప్రదర్శన



టెకీకూహిల్

పోలీసులతో సమానంగా హోంగార్డ్సు సేవలు

● ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ ● ఘనంగా హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా హోంగార్డులు స్వచ్ఛందంగా సేవలందించడం ముదావహమని ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ అన్నారు. 63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏఎఆర్ ఏఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఏఎస్పీ వీవీ నాయుడు హోంగార్డ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా విజయవాడలో హోంగార్డ్స్ రక్షణ దళం మొదలైందన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ హోంగార్డ్స్ తమ సేవలను పోలీసులతో పాటు ట్రాఫిక్, రక్షణ, డ్రైవర్లుగా, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రక్షణగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహనలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డ్ కుటుంబ సభ్యులకు ఒకరోజు గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. హోంగార్డ్స్ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. అనంతరం హోమ్‌గార్డులు అద్భుతంగా కవాతును ప్రదర్శించారు. అనంతరం హోంగార్డులు నిర్వహించిన ర్యాలీని అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్ నుంచి లక్ష్మీటాకీసు వరకు ఈ ర్యాలీ కొనసాగింది.



ర్యాలీ నిర్వహిస్తున్న హోంగార్డులు

ఆటపాటల్లో నైపుణ్యం పెంచుకోవాలి

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- కృష్ణాతరంగ్ చాంపియన్‌గా పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు
- రన్నర్స్‌గా నలంద కళాశాల జట్టు
- 3 రోజుల పాటు కృష్ణాతరంగ్ విద్యార్థుల కళా ప్రతిభకు దర్పణం
- వైభవంగా ముగింపు ఉత్సవాలు





బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరా, వీసీ రాంజీ, విజేతగా నిలిచి పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళాత్మక ప్రదర్శనలపై శిక్షణ ఇవ్వడం ముదావహమని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు అన్నారు. కృష్ణా వర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన కృష్ణాతరంగ్ ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. వందలాది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని విద్యార్థులు పెద్ద ఎత్తున రుద్రవరంలోని కృష్ణా వర్సిటీకి తరలివచ్చారు. ఒకరిపై ఒకరు పోటీ పడుతూ ఆద్యంతం ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. రన్నర్స్‌గా విజయవాడ నలంద కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. నాలుగు విభాగాలకు చెందిన 28 కేటగిరిల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఉపకులపతి కూన రాంజీ, బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామినిశర్మ బహుమతులు అందచేశారు. షీల్డు, ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థుల కేరింతలు మారుమోగాయి. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు నేర్చుకున్న కళలను వదిలిపెట్టకుండా కొనసాగించాలన్నారు. ఉపకులపతి కూన రాంజీ మాట్లాడుతూ సీనియర్ కళాకారులకు దీటుగా విద్యార్థులు శాస్త్రీయ, వెస్ట్రన్ సంగీతాన్ని గానం చేశారన్నారు. శాస్త్రీయ నృత్యంతో పాటు గిరిజన నృత్యం, పాశ్చాత్య నృత్యాలను ప్రదర్శించి తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఉష, రెక్టార్ బసవేశ్వరరావు, కృష్ణాతరంగ్ ఇన్‌చార్జి దిలీప్ పాల్గొన్నారు. విద్యార్థులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చూపిన శ్రద్ధపై కళాశాలల యాజమాన్యాలు అభినందించారు.



ఎత్తిపోతల పథకంపై నుంచి కృష్ణానదిని పరిశీలిస్తున్న ఐడీసీ ఎండీ ఎస్ తిరుమలరావు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

ఎత్తిపోతల పథకాల పరిశీలన

● ఐడీసీ ఎండీతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే సౌమ్య

చందర్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలను ఐడీసీ ఎండీ ఎస్ తిరుమలరావు, పులిచింతల ఎస్ఈ మెహిద్దీన్‌తో కలిసి ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు పరిశీలించారు. పులిచింతల డ్యామ్ నీటిని నిలిపివేయడంతో ఎత్తిపోతల పథకాలకు నీరందడం లేదని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం ఈ పర్యటన నిర్వహించారు. మండలంలోని కొడవటికల్లు, పొక్కునూరు, కాసరబాద, ఉస్తేపల్లి ఎత్తిపోతల పథకాల వద్ద కృష్ణానదీ ప్రవాహాన్ని పరిశీలించారు. నదీ ప్రవాహం గుంటూరు జిల్లా వైపు ఉండడం వల్ల ఇక్కడి పథకాలకు నీరందడం లేదని సౌమ్య అధికారులకు తెలిపారు. తక్షణమే పులిచింతల నుంచి 3వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కోరారు. శాశ్వత పరిష్కారంగా ఎన్టీఆర్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు ప్రత్యేకంగా కాలువ ఏర్పాటు చేసి నిరంతరం నీటిని అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ఐడీసీ ఎండీ తిరుమలరావు మాట్లాడుతూ నీటి విడుదలకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సౌమ్య చెప్పినట్టు శాశ్వత పరిష్కారంపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ పర్యటన సందర్భంగా వందలాది మంది రైతులు అధికారులను కలిసి తమ గోడును వివరించారు. ఐడీసీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఈఈ చిన్నయ్యరెడ్డి, ఐడీసీ డైరెక్టర్ అంకం ఇందిరా ప్రియదర్శిని, టీడీపీ మండలాధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, కోనాయపాలెం సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, వాసిరెడ్డి సాంబశివరావు, బొందల రామకృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో చెత్తను ఏరిన కలెక్టర్ బాలాజీ

సైకిల్‌పై వచ్చి పరిసరాలను శుభ్రం చేసి..

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని కలెక్టర్ బాలాజీ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు కలెక్టర్ సైకిల్‌పై వచ్చారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా అధికారులు, ఉద్యోగులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. డీఆర్వో చంద్రశేఖరరావు, డీఈవో రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కన్నుమూత



పార్థివదేహం పిన్నమనేని వైద్య కళాశాలకు అప్పగింత ● ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సహా ప్రముఖుల నివాళి

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కోటేశ్వరరావు(74) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యాపార రీత్య 30 ఏళ్ల క్రితం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేశారు. అప్పటి టీడీపీ ఎమ్మెల్యేల అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. వసంత నాగేశ్వరరావు, దేవినేని నెహ్రూ, దేవినేని రమణ లాంటి నాటి ప్రముఖులతో సత్సంబంధాలు ఉండేవి. విశాఖపట్నం వెళ్లిన తరువాత కూడా టీడీపీ కోసం పని చేశారు. కోటేశ్వరరావు భౌతికకాయానికి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు ముసునూరు రత్నబోస్, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, విజయ విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కిసాన్ మోర్చా, రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఇన్‌చార్జి సర్పంచ్ పాలడుగు నాని, జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి వెంకటరత్నం, వేగిరెడ్డి పాపారావు, సుంకర కృష్ణమోహన్, గూడపాటి పద్మ శేఖర్, కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు.



కోటేశ్వరరావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

దేవాలయాల అభివృద్ధికి నిధులివ్వండి

● మంత్రికి ఎమ్మెల్యే తాతయ్య వినతి

జగ్గయ్యపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి, ముక్త్యాలలో శ్రీ కోటిలింగ హరిహర క్షేత్రం, వేదాద్రి శ్రీ యోగానంద స్వామి దేవస్థానాల అభివృద్ధికి టెంపుల్ టూరిజం, ప్రసాదం పథకాల కింద నిధులు మంజూరు చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో 19 ధూపదీప నైవేద్యాల కోసం అనుమతివ్వాలని కోరారు. వేదాద్రి దేవస్థానానికి ఘాట్ రోడ్డు నిర్మాణ శంకుస్థాపనకు హాజరు కావాలని మంత్రిని కోరారు. అంతేకాక నియోజకవర్గంలో ఈనామ్ భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రిని ఆయన ప్రత్యేకంగా కోరారు. వేదాద్రి దేవస్థానం ఈవో కానూరి సురేష్‌బాబు, దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తల తరపున రాంప్రసాద్ ఉన్నారు.






పేటలో మంత్రి ఆనంకు వినతిపత్రం ఇస్తున్న తాతయ్య, నందిగామలో ఇనాం బాధిత రైతులు

ఇనాం భూములు సమస్య పరిష్కరించండి

నందిగామ: ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధిత రైతులు మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం టీడీపీ సీనియర్ నేత తొండెపు జనార్ధన్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరారు. విధానపరమైన నిర్ణయం తీసుకొని తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరారు. స్పందించిన మంత్రి ఆనం త్వరలో సీఎంను కలిసి వివరిస్తానని హామీ ఇచ్చారు. ఈనామ్ బాధిత రైతు సంఘం నేతలు ప్రసాద్, అచ్యుతరామయ్య, రాటకొండ రామకోటేశ్వరరావు, సుధీర్, నరసింహారావు, రాంబాబు, చంద్రశేఖర్, కరుణాకరరెడ్డి, రామసుబ్బారావు, వెంకట్రావు, సూర్యనారాయణ, శ్రీను, శివాజీ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వీరవల్లి బైపాస్ వద్ద కారులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన శనివారం ఉదయం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్నవారు అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపి బయటకు పరుగులు తీశారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరిన జంగారెడ్డిగూడెం మండలం తాడ్వాయికు చెందిన ఇద్దరు మహిళల సహా ఏడుగురు వీరవల్లి బైపాస్‌పై కారు ఆగిపోవడంతో పాటు పొగ రావడంతో భయంతో దిగిపోయి రోడ్డు పక్కకు వెళ్లిపోయినట్టు తెలిపారు. స్థానికుల సమాచారంతో హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు మొత్తం దగ్ధమైపోయింది. వీరవల్లి ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను వేరే వాహనంలో తరలించారు. కారులో పొగలు రావడంతో ప్రయాణికుల అప్రమత్తతే వారిని కాపాడిందన్నారు.



గన్నవరం సీహెచ్‌సీ

అభివృద్ధికి నిధులు

ఫలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి ● సీఎస్ఆర్ సంస్థ నిధులు మంజూరు



విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపయోగపడే గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి వివిధ సంస్థల నుంచి నిధులు సమీకరించడంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషి ఫలించింది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ఈ వైద్యశాలకు నిధులు తెచ్చి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే భావించారు. దీంతో పదవి చేపట్టిన వెంటనే వైద్యశాల అభివృద్ధికి నిధుల కోసం వైద్యారోగ్య శాఖను సంప్రదించగా నిధుల కొరత ఉందని, ప్రతిపాదనలు అందజేస్తే ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తామని తెలిపింది. ఈ ప్రక్రియతో హెల్త్‌సెంటర్ అభివృద్ధి జాప్యం అవుతుందని భావించిన యార్లగడ్డ కార్పొరేట్ సంస్థలతో సంప్రదింపులు జరిపి సీఎస్ఆర్ నిధులు తెచ్చే ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు అవి ఓ కొలిక్కి వచ్చాయి. ఈ మేరకు కోల్ ఇండియా సంస్థ చైర్మన్ పోలవరపు ప్రసాద్‌ను కలిసి సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి వైద్యశాల అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. యార్లగడ్డ విజ్ఞప్తి మేరకు స్పందించిన ప్రసాద్ పదవీ విరమణకు రెండురోజుల ముందు రూ.2.25 కోట్ల నిధులను గన్నవరం సామాజిక వైద్యశాల అభివృద్ధికి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. వైద్య చికిత్సలకు అవసరమైన అధునాతన వైద్య పరికరాల ఏర్పాటుకు ఈ రూ.2.25 కోట్ల నిధులు వెచ్చించి త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. నిధులు మంజూరు చేసిన చైర్మన్ పోలవరపు ప్రసాద్ సేవలు మరువలేమని యార్లగడ్డ అన్నారు. ఇదిలా ఉండగా గన్నవరంలోని హెచ్‌సీఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధులను గత ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం గుడివాడ నియోజకవర్గానికి కేటాయించగా ఎమ్మెల్యే పదవి చేపట్టిన వెంటనే వెంకట్రావు హెచ్‌సీఎల్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు స్పందించిన హెచ్‌సీఎల్ సంస్థ రూ.17.25 లక్షల నిధులను మంజూరుచేసి అభివృద్ధికి సహకరించింది. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆసుపత్రికి ఎమ్మెల్యే చొరవతో అధునాతన వసతులు సమకూరుతున్నాయి.

రబీకి ఎరువులు సిద్ధం: కలెక్టర్

కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సన్నద్ధతా చర్యల్లో భాగంగా రబీ సీజన్‌కు వివిధ రకాల ఎరువులను సిద్ధంగా ఉంచుతున్నామని, ప్రస్తుతం అవసరానికి అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి జిల్లాలో రబీకి ఎరువుల అవసరం, లభ్యత, ధాన్యం కొనుగోళ్లపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రబీలో 33,765 హెక్టార్లలో వివిధ పంటల సాగు చేపట్టడం జరుగుతుందన్న అంచనాలకు అనుగుణంగా ఎరువుల సరఫరా ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. డిసెంబరు నెలకు 17,812 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ప్రస్తుతం 27,542 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 7,815 మెట్రిక్ టన్నుల యూరియా, 1,983 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,720 మెట్రిక్ టన్నుల పొటాష్, 13,659 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సులు, 2,365 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ అందుబాటులో వున్నట్లు వివరించారు. ఇప్పటికే 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని, గన్నీ బ్యాగులకు ఎక్కడా కొరతలేదని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



కూచిపూడిలో బాలుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శిరీష

మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు

కూచిపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై పి.శిరీష హెచ్చరించారు. మొవ్వ, కూచిపూడి గ్రామాల్లో శనివారం ఆమె వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు కచ్చితమైన డాక్యుమెంట్లు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



ఏకేటీపీ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉండాలి

● బాలికలకు స్వీయరక్షణ అవశ్యం : డీఎస్పీ

గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా, ఎంతటి వారైన చెయ్యి వేస్తే ప్రతిఘటించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ధీరజ్ వినీల్ మాట్లాడుతూ బాలికలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెం.112కు కాల్ చేయాలన్నారు. కెరీర్ ప్లానింగ్, సైబర్ నేరాలు, ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనే విధానాలను వివరించారు. స్వీయరక్షణ విద్యలను నేర్చుకోవాలని సూచించారు. టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



ధనుర్మాస ఉత్సవ రాటా ప్రతిష్ఠ

గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాతమున్సిపల్ కార్యాలయం వద్ద గల కోదండ రామాలయంలో 81వ వార్షిక ధనుర్మాస ఉత్సవ రాటాను శనివారం ప్రతిష్ఠించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు డొక్కు రాంబాబు మాట్లాడుతూ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 80 ఏళ్లుగా కోదండ రామాలయంలో ధనుర్మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుత్తా చంటి, కార్యదర్శి దారపురెడ్డి ప్రసాద్, సభ్యులు రామకృష్ణ, పోలగాని కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐ హనీష్

ఇష్టంతో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు

గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పట్టణంలోని మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులు 250 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. తండ్రి బండి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం విశ్రాంత ఉపాధ్యాయులు బండి గోవర్ధనరావు స్టడీ మెటీరియల్స్ అందించడం అభినందనీయమన్నారు. గోవర్ధనరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టూటౌన్ సీఐ జె.ఆర్.కె.హనీష్, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.ఫ్రాన్సిస్, డి.శ్యామ్‌ప్రసాద్, కె.మహేష్, ఆర్.రాజు, ప్రధానోపాధ్యాయుడు డి.నరేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షా పే చర్చ - 2026కు విద్యార్థుల ప్రశ్నలను రిజిస్ట్రేషన్ చేస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

పరీక్ష పే చర్చకు విద్యార్థుల రిజిస్ట్రేషన్

గుడ్లవల్లేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీతో నేరుగా కలిసే పరీక్షా పే చర్చ - 2026 అర్హతకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో విద్యార్థి తమ ప్రశ్నను రిజిస్ట్రేషన్ చేయించుకొంటారని, ఆ ప్రశ్న ఎంపికైతే ప్రధానిని కలిసి ప్రశ్న అడిగే అవకాశం కల్పిస్తారని లక్ష్మీనారాయణ తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలకు నోడల్ అధికారిగా డీఈవో, కో-ఆర్డినేటర్‌గా లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారు. డైట్ అధ్యాపకులు ఎం.శివపార్వతి, ఎస్.జోజి బాబు, టి.రాజ్యలక్ష్మి, లక్ష్మి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి : ఏడీఏ



మాట్లాడుతున్న ఏడీఏ కవిత

గుడివాడ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడరాదని ఏడీఏ సూరపనేని కవిత అన్నారు. బిళ్లపాడు సచివాలయంలో రసాయన ఎరువుల అనర్థాలపై శనివారం ఆమె అవగాహన కల్పించారు. ఎరువులు వాడని వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అవసర మేరకు మాత్రమే తగు మోతాదులో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మరలాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో జీలుగ, పిల్లిపెసర పచ్చిరొట్టను సాగు చేసి ట్రాక్టర్లతో తొక్కిస్తే భూమికి బలం ఏర్పడుతుందని తెలిపారు. ఎరువుల కన్నా సేంద్రియ ఎరువులు వాడటం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాము, కాగిత, వర్ల



పామర్రులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల, కాగిత, కుమార్ రాజా

గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహనీయుడు బిఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా అన్నారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం నెహ్రూచౌక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, లింగం ప్రసాద్, కంచర్ల సుధాకర్, కనకాంబరం, గడ్డం ప్రకాష్‌దాసు, వడ్డాది నాగరాజు, దాసు శ్యాంప్రసాద్, డేవిడ్, భవాని, మెరుగు మోజెస్, ఇమ్మానియేలు, కోన కేశవ్, కొదమల గంగాధర్, రామదేణు వేణుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జనసేన జిల్లా నాయకుడుసందు వసన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, నాయకులు గాదె కిరణ్, సయ్యద్ నజీర్, కొల్లూరి కిరణ్, బురిడి శాంతినాయుడు, దామోదరరావు, శ్రీను, రామకృష్ణ, సుమంత్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఇంటూరి గజేంద్ర, కాకి బాబ్జీ, మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. బీజేపీ నాయకులు వలపర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టిడ్కో కాలనీలో ఎస్.సి మోర్చా అధ్యక్షుడు దేవరపల్లి వెంకట్ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదిమాంధ్ర సంఘం జిల్లా కార్యదర్శి చంటి అంబేడ్కర్ చిత్రపటానికి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ అంబేడ్కర్ విగ్రహానికి, వైసీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీనుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు : అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో (సచివాలయ వ్యవస్థ) ఎలీషారావు, పంచాయతీ కార్యదర్శి ఎ.నరసింహారావు, జాని నివాళులర్పించారు.

ఆర్థిక, సామాజిక అసమానతలు రూపుమాపడమే నిజమైన నివాళి

పామర్రు : పరిపూర్ణమైన విద్య, విజ్ఞానంతో దేశాన్ని సుసంపూర్ణం చేసి ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపడమే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు మనమంతా అర్పించే అసలైన నివాళి అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని పామర్రు నాలుగు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కుమార్ రాజా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందన్నారు.అంబేడ్కర్ చూపిన మార్గంలో అం దరూ ముందుకు సాగాలన్నారు. కాగా, ఎంపీపీ అశోక్‌కుమార్ వైసీపీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఎస్సీ, బీసీ నేతలు రామాంజనేయులు, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శుభాకర్, ఎస్సై రాజేంద్రప్రసాద్

అంకమ్మ హుండీ చోరీ దొంగల అరెస్టు

పామర్రు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పామర్రులో అంకమ్మతల్లి దేవస్థానం హుండీ నగదు చోరీ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వి.శుభాకర్, ఎస్సై రాజేంద్రప్రసాద్‌తో కలిసి అరెస్టు చేసిన నిందితులను మీడియాకు చూపించారు. ఈనెల ఒకటో తేదీ రాత్రి అంకమ్మ ఆలయం హుండీ తాళాలు పగలగొట్టి నగదు చోరీ చేసు కేసులో చందోలు జశ్వంత్ (21), షేక్ మున్నా (20)లతోపాటు బాలుడిని అరెస్టు చేశామన్నారు. నిందితులను మార్కెట్‌యార్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి చల్లపల్లిలో దొంగిలించిన ద్విచక్ర వాహనం, రూ.3600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. రేపల్లె, నగరం, భట్టిప్రోలు తదితర ప్రాంతాల్లో బైక్‌ల చోరీ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారన్నారు. దుర్గానగర్‌లో చోరీకి విఫల యత్నం చేశారన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎస్సై రాజేంద్రప్రసాద్, సిబ్బందిని సీఐ అభినందించారు. చోరీల నిరోధానికి ప్రజలు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఆయన సూచించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ

సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కూచిపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ సహకార సంఘ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆయా పీఏసీఎస్‌ల్లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి నిరసన తెలిపారు. మొవ్వ బ్రాంచ్ పరిధిలోని కాజ, కోసూరు, మొవ్వ, మొవ్వపాలెం, కూచిపూడి, చినముత్తేవి, అయ్యంకి, గూడూరు బ్రాంచి పరిధిలోని అవిరిపూడి, మంత్రిపాలెం పీఏసీఎస్‌ల ఉద్యోగులు నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని,మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, ఉద్యోగులకు బీమా వర్తింపచేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేదలకు అన్నదానం


తోట్లవల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ టీడీపీ సీనియర్ నాయకుడు, కుమ్మమూరు గ్రామానికి చెందిన జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని వెంకట కుటుంబ నరసింహారావు(కుటుంబయ్య) జన్మదినోత్సవం శనివారం తోట్లవల్లూరు లయన్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి కేక్‌ను కట్ చేశారు. 50 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు నెక్కలపూడి మురళీ, వల్లూరు రాంబాబు, గొరిపర్తి గోపయ్య, తటుకూరి రమణ, ఎంఎం దౌలా పాల్గొన్నారు.



సావిత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సావిత్రి కళాపీఠం గౌరవాధ్యక్షుడు చక్రపాణి, ప్రభాకరరావు, లంకిశెట్టి బాలాజీ తదితరులు

సావిత్రికి చిత్రకళా సంసద్ ఘననివాళి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అభినయంలో మేటి అనిపించుకున్న మహానటి సావిత్రి, ఎందరికో గుప్తదానాలు చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. చిత్రకళా సంసద్ ఆధ్వర్యంలో మహానటి సావిత్రి 90వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కళాపీఠం గౌరవ అధ్యక్షుడు మెండు చక్రపాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి సావిత్రి చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్ర చిత్రపరిశ్రమకు, విద్యాభివృద్ధికి అందించిన సేవలను వివరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, మానవత్వం పరిమళించిన మహామనిషి సావిత్ర అన్నారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షుడు బడే ప్రభాకరరావు, సీనియర్ న్యాయవాది కోసూరి మాధవ్, మండల దుర్గాప్రసాద్, పరుచూరి బాబు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



బయోఫోర్టిఫైడ్ మొక్కజొన్న విత్తనాల పంపిణీ

ఘంటసాల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలోశనివారం బయో ఫోర్టిఫైడ్ మొక్కజొన్న విత్తనాలను ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఘంటసాల, చిరువోలు, మోపిదేవి, పాగోలు ప్రాంతానికి చెందిన రైతులకు ఎకరానికి ఎనిమిది కిలోల చొప్పున ఒక్కొక్క రైతుకు రెండు ప్యాకెట్లు అందజేశారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఈ రకం మొక్కజొన్న పోషక విలువల లభ్యత అధికంగా ఉంటుందన్నారు. రైతులు సాగు చేసి ఫలితాలను, అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఈ రకం మొక్కజొన్న ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని పరిశోధనలో తేలిందన్నారు. శాస్త్రవేత్తలు కె.రేవతి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి మెడికల్ సెంటర్లో వైద్యపరీక్షలు



మందులు అందజేస్తున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావు

గుడ్లవల్లేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు ఉచిత వైద్యసేవలందించారు. ఏలూరు దంతవైద్య కళాశాల వైద్యులు దంత పరీక్షలు, విజయవాడ పీవీఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వెంకట్రావు గ్యాస్ట్రోఎంట్రాలజీకి, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జూనియర్ అసిస్టెంట్‌కి రికార్డులు అప్పగింత

తోట్లవల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై ఎస్.రత్నకుమారి వచ్చారు. నిధుల దుర్వినియోగం నేపథ్యంలో తోట్లవల్లూరు జూనియర్ అసిస్టెంట్ సునీల్‌ను జిల్లా పంచాయతీ అధికారి నవంబరు 3వ తేదీన సస్పెండ్ చేసిన విషయం విదితమే. దీంతో జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. రికార్డులు సునీల్ వద్దే ఉండిపోయాయి. కంకిపాడు మండలం గొడవర్రు పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రత్నకుమారి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది తోట్లవల్లూరు పంచాయతీకి వచ్చారు. సునీల్ తన వద్ద ఉన్న రికార్డులను శనివారం ఆమెకు అప్పగించారు. 2025 సెప్టెంబరు వరకు రికార్డులను అప్పగించటం రెండు రోజుల్లో పూర్తవుతుందని సునీల్ తెలిపారు.

పాలసంఘాలకు రూ.38 లక్షల బోనస్ పంపిణీ



చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పాలశీతల కేంద్రం పరిధిలో 84 పాలసంఘాలకు రూ.38లక్షల 1250 లను బోనస్‌గా పంపిణీ చేశారు. నాలుగు నెలలకు బోనస్ చెక్కులను శనివారం చల్లపల్లి పాలకేంద్రం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయా పాలసంఘాల అధ్యక్షులకు అందించారు. కృష్ణామిల్క్‌యూనియన్ పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకట రమణ, జిల్లా ట్రస్ట్ బోర్డు సభ్యుడు గోళ్ల పూర్ణమల్లిఖార్జునరావు, మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని బోనస్ పంపిణీ చేశారు. పాల సేకరణ అధికారి తమ్మన సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. చల్లపల్లి పాలశీతల కేంద్రానికి అత్యధికంగా పాలు సరఫరా చేసిన మొదటిస్థానంలో నిలిచిన ఘంటసాల సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నేడు

గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ టి.లక్ష్మీ పెరుమాళ్లు, టి.ప్రభావతి, చలసాని రాయన్ చౌదరి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం కోతిబొమ్మ సెంటర్‌లోని డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పెదఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులు వైద్యసేవలందిస్తారన్నారు. ఆర్థోపెడిక్, జనరల్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు.

కూచిపూడిలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

● ఉచితంగా ఎముకల దృఢత్వ పరీక్ష

కూచిపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కూచిపూడి జైహింద్ టాకీస్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాకులు గొట్టిపాటి సాయి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, కంటి, వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

డాక్టర్ ఎం.వి.హరిప్రసాద్, డాక్టర్ కె.వి. రామకిషోర్, డాక్టర్ ఎస్.వేణు బృందం వైద్యసేవలు అందిస్తారాన్నరు. ఈ శిబిరంలో రూ.3 వేల విలువ గల ఎముకల దృఢత్వ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. రోగులకు ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు సాయి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

చిన్నారులపై లైంగిక దాడుల నివారణకు ఐక్య కృషి అవసరం

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ చైల్డ్ సైకాలజిస్ట్ రత్తకుమారి అన్నారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ యుగంధర్, డాక్టర్ హిమబింధు ఆధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడుల నివారణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ తరుణ్‌శంకర్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఆనంద్ జోషికుమారి, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్, పోలీస్, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల, బండి రామకృష్ణ



దాలిపర్రులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అంబేడ్కర్ సేవలు ఎనలేనివి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సేవలు ఎనలేనివని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. వర్ధంతిని పురస్కరించుకొని లక్ష్మీటాకీసు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ సంఘం నేత కొనకళ్ల బుల్లయ్య, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిట్టూరి యువరాజు, గుమ్మడి విద్యాసాగర్, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** లక్ష్మీపురం సెంటర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి అజయ్‌ఘోష్, శ్యామ్‌సన్, మోహనరావు, మాజేటి శివశ్రీనివాసరావు, కొల్లాటి శీనివాసరావు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, బొడ్డు నాగరాజు, వంగల రాజు, పొదిలివెంకన్న, తదితరులు నివాళులర్పించారు. **అవనిగడ్డ :** నేరేళ్లపాలెం బస్టాఫ్ దగ్గర అంబేడ్కర్ విగ్రహానిక దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, పెదపాలెం సర్పంచ్ దున్నా రాజేష్, గుంటూరు వినయ్, నలుకుర్తి రాము, కొల్లూరి శేఖర్, నలుకుర్తి చంద్రశేఖర్, బందెల చంద్రశేఖర్, మునిపల్లి రవి, మునిపల్లి కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. **మోపిదేవి :** అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. పెదప్రోలులో అంబేడ్కర్ విగ్రహానికి గ్రామసర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. అంబేడ్కర్ యువత పుస్తకాలు పంపిణీ చేశారు. **అవనిగడ్డ రూరల్:** పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఈవో బి.అనిత తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. **నాగాయలంక :** ఎస్సీ, ఎస్టీ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మంచాల తిరుపతి వరప్రసాద్, తానంకి పోతురాజు, గుంటూరు సురేష్, బట్టు జయపాల్, బొంతు రాజు, కె.ఆదాము, కొల్లూరి ఇమ్మానియేలు, తానంకి చంటి, రాజారావు పాల్గొన్నారు.

దాలిపర్రులో బౌద్ధ సంప్రదాయంలో అంబేడ్కర్ వర్ధంతి

ఘంటసాల : దాలిపర్రులో బి.ఆర్.అంబేడ్కర్ పరినిర్వాణ్ దివస్ బౌద్ధసంప్రదాయంలో నిర్వహించారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు హృదయ రత్నబోధి (వై.హరిబాబు), ఏపీ సెక్రటేరియేట్ లా డిపార్ట్‌మెంట్ సెక్రటరీ వెలగలపల్లి వెంకటేశ్వరరావు, కులశ రత్నబోధి, దేవా గోవర్ధన్, దాసి సీతారామరాజు, గడ్డేటి పెద్ద నాంచారయ్య, గడ్డేటి నాగులు, మద్దాల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఘంటసాలపాలెంలోని దళితవాడల్లో సర్పంచ్ దోనె రజని, దేవరకోటలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, చిట్టూర్పులో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళంలో సర్పంచ్‌లు ముప్పనేని రవిప్రసాద్, రాచూరి ప్రసాద్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, గోగినేని పాలెంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అత్తులూరి గోపిచంద్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలి

● అధికారులకు జేసీ నవీన్ ఆదేశం

బంటుమిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులకు ఆదేశించారు. సాధారణ తనిఖీలో భాగంగా శనివారం ఆయన బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రీ-సర్వే విషయమై ఆరా తీశారు. షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వి.సుభాష్ చంద్ర బోస్, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఏఎస్‌వో శేషారావు, సర్వేయర్ దాస్, ఆర్ఐ బి.శివశంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బుద్దాలపాలెం పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత చేరువ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. బుద్దాలపాలెంలో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించే పంచాయితీ కార్యాలయ భవనానికి రామకృష్ణ శనివారం శంకుస్థాపన చేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు, డీడీవోల నియామకంతో పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, సీనియర్ టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్, రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, గడ్డం రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొక్కు లక్ష్మణ పాల్గొన్నారు.



ఆలయాన్ని సందర్శిస్తున్న డాక్టర్ చంద్రమౌళి కుటుంబ సభ్యులు

విఘ్నేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీవిఘ్నేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం, శిఖర నిర్మాణానికి దాతలు విరాళాలను అందజేశారు. చల్లపల్లి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొర్రపాటి దుర్గారామచంద్రరావు జ్ఞాపకార్థం అల్లుడు లింగం శివప్రసాద్-విమలాదేవి దంపతులు రూ.లక్షా116, కొర్రపాటి లక్ష్మీబాయి రూ.25 వేలు, డాక్టర్ చంద్రమౌళి జ్ఞాపకార్థం భార్య పున్నమాంబ రూ.25 వేలు, ముక్కామల సాయిరఘు-వీణాశాలిని రూ.10,116, డాక్టర్ నామినేని శ్రీనివాస్-ఉమావాణి రూ.10,116, కొర్రపాటి కేశవరావు-జ్యోత్స్న రూ.25 వేలు శిఖర నిర్మాణానికి విరాళం అందించారు. కూచిభట్ల గోపాలకృష్ణమూర్తి రూ.50,116, ఎస్‌వీకె బేకరి నిర్వాహకులు పూషడపు శ్రీనివాసరావు 200 సిమెంటు బస్తాలను అందించారు. కమిటీ పెద్దలు ఆత్మకూరి వెంకటేశ్వరరావు, నర్రా సురేంద్ర(చిన్ని), బళ్లా మధు, అర్చకులు వేమూరి శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.



బోనస్ అందిస్తున్న మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ., మేనేజర్ గోపీనాథ్, మల్లిఖార్జునరావు

పాలసంఘాలకు రూ.38 లక్షల బోనస్ పంపిణీ

చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పాలశీతల కేంద్రం పరిధిలో 84 పాలసంఘాలకు రూ.38లక్షల 1250 లను బోనస్‌గా పంపిణీ చేశారు. నాలుగు నెలలకు బోనస్ చెక్కులను శనివారం చల్లపల్లి పాలకేంద్రం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయా పాలసంఘాల అధ్యక్షులకు అందించారు. కృష్ణామిల్క్‌యూనియన్ పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకట రమణ, జిల్లా ట్రస్ట్ బోర్డు సభ్యుడు గోళ్ల పూర్ణమల్లిఖార్జునరావు, మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ ముఖ్య అతిధులుగా పాల్గొని బోనస్ పంపిణీ చేశారు. పాల సేకరణ అధికారి తమ్మన సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. చల్లపల్లి పాలశీతల కేంద్రానికి అత్యధికంగా పాలు సరఫరా చేసిన మొదటిస్థానంలో నిలిచిన ఘంటసాల సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



బయోఫోర్టిఫైడ్ మొక్కజొన్న విత్తనాల పంపిణీ

ఘంటసాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలోశనివారం బయో ఫోర్టిఫైడ్ మొక్కజొన్న విత్తనాలను ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఘంటసాల, చిరువోలు, మోపిదేవి, పాగోలు ప్రాంతానికి చెందిన రైతులకు ఎకరానికి ఎనిమిది కిలోల చొప్పున ఒక్కొక్క రైతుకు రెండు ప్యాకెట్లు అందజేశారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఈ రకం మొక్కజొన్న పోషక విలువల లభ్యత అధికంగా ఉంటుందన్నారు. రైతులు సాగు చేసి ఫలితాలను, అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఈ రకం మొక్కజొన్న ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని పరిశోధనలో తేలిందన్నారు. శాస్త్రవేత్తలు కె.రేవతి తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు పైడమ్మ జాతర



పెడన, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ జాతర ఉత్సవాలు శనివారం మూడో రోజుకు చేరాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఆమె భర్త, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్‌అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో జి.వి. కృష్ణారావు, ఆశాది దాసు శ్యామ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారిని సత్కరించారు. ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 21న జరిగే భారీ అన్నసమారాధనకు భక్తులు విరాళాలిచ్చి సహకరించాలని ఈవో జి.వి.కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. విరాళాలు టికెట్ కౌంటర్‌లో ఇచ్చి రశీదులు పొందాలని సూచించారు. శిడి బండ్ల మొక్కుబడులు ఉన్న వారు మంగళ వాయిద్యాలతో మా త్రమే ఆలయానికి రావాలన్నారు.

విద్యుత్ ఎస్ఈ చిరంజీవి బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ ఎస్ఈ వి.వి.చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

తెనాలిలో ఈఈగా పని చేస్తున్న చిరంజీవి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సత్యానందం విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన చిరంజీవి శనివారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు.

టీడీపీ సీనియర్ నాయకుడు వెంకట్రామయ్య మృతి



మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య(74) శనివారం నాగాయితిప్పలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెంకట్రామయ్య మృతి పట్ల ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ మం డల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, పరుచూరి శ్రీనివాసరావు, రావి నాగేశ్వరరావు, వేములపల్లి రవిచంద్ర, బల్లా సీతారామప్రసాద్, పుప్పాల ఏసు, చందన రంగారావు వెంకట్రామయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు.

రెండోరోజు టీడీపీ శ్రేణుల అభిప్రాయ సేకరణ

మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీ ఎన్నిక ప్రక్రియలో రెండోరోజు శనివారం నాగాయలంక, మోపిదేవి మండలాలకు సంబంధించి మోపిదేవిలో అభిప్రాయ సేకరణ చేశారు. ఏపీఐఐసీ చైర్మన్, సంస్థాగత ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు మంతెన రామరాజు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వ్యక్తిగతంగా అభిప్రాయ సేకరణ చేశారు. పార్టీ జాతీయ నాయకత్వం తుది నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడాల్సి ఉంటుందని వారు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి

మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ ఎంపీడీవో ఎస్.రుక్మిణి అన్నారు. కొక్కిలిగడ్డ గ్రామసచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, పనితీరును రికార్డుల తనిఖీ ద్వారా ఆమె పరిశీలించారు. ప్రజలకు గ్రామస్థాయిలో సత్వర సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. గ్రామసర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు పాండు రంగారావు, సచివాలయ కార్యదర్శి చందన పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి కోటి సంతకాల సేకరణ

అవనిగడ్డ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో మాజీ ఎమ్మె ల్యే సింహాద్రి రమేష్‌బాబు, యువ నాయకుడు సింహాద్రి వికాస్ కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. తక్షణమే వైద్య కళా శాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి డిమాండ్ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. (ఫోటోరైటప్: 6 ఎంటిఎం 04 - ఉచిత వైద్య సేవా శిబిరంలో పిల్లలకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జి. తియోఫిలస్)

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాల్యం నుంచి సెల్‌ఫోన్లకు బానిస కాకుండా నేత్రాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్టార్ విద్యా సంస్థల అధినేత పి. శ్రీరాం అన్నారు. సన్‌స్టార్ స్కూల్‌లో మానతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ తియోఫిలస్, డాక్టర్ ప్రియదర్శిని శనివారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని శ్రీరాం ప్రారంభించి ప్రసంగించారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్య, వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కేన్సర్ బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. మానవత ఉపాధ్యక్షుడు బొమ్మిడి స్వామి, ఎం.ఎల్.ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ



పెడన, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ ఆధ్వర్యంలో పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పారిశుధ్య కార్మికులకు శనివారం రగ్గులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రసాద్, వంకా శ్రీనివాసరావు, రామారావు, రూపనాగశ్రీ, బోనగిరి సత్యనారాయణల రగ్గులను సమకూర్చారు. రగ్గుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్. సరళకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మానవత స్వచ్ఛంద సంస్థ పెడన శాఖ చైర్మన్ అనుమకొండ గౌరీప్రసాద్, అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి, ప్రిన్సిపాల్ కె.సి.ఎస్.వి. రామారావు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సావిత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సావిత్రి కళాపీఠం గౌరవాధ్యక్షుడు చక్రపాణి, ప్రభాకరరావు, లంకిశెట్టి బాలాజీ తదితరులు

సావిత్రికి చిత్రకళా సంసద్ ఘననివాళి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అభినయంలో మేటి అనిపించుకున్న మహానటి సావిత్రి, ఎందరికో గుప్తదానాలు చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. చిత్రకళా సంసద్ ఆధ్వర్యంలో మహానటి సావిత్రి 90వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కళాపీఠం గౌరవ అధ్యక్షుడు మెండు చక్రపాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి సావిత్రి చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్ర చిత్రపరిశ్రమకు, విద్యాభివృద్ధికి అందించిన సేవలను వివరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, మానవత్వం పరిమళించిన మహామనిషి సావిత్ర అన్నారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షుడు బడే ప్రభాకరరావు, సీనియర్ న్యాయవాది కోసూరి మాధవ్, మండల దుర్గాప్రసాద్, పరుచూరి బాబు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అబివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మధుసూదనరావు అధ్యక్షతన శనివారం జరిగింది. మండలంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఎంపీడీవో పి. శైలజాకుమారి, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్డీ రాజేశ్వరి, ఏవో రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆక్వా సాగులో మెలకువలపై అవగాహన

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలోని శ్రీనివాస మత్స్య సహకార సం స్థ సభ్యులకు చేపలు, రొయ్యల సాగులో మెలకులవలపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం లక్ష్యాలను వివరించారు. మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ చేపల పెంపకంలో నీటి నాణ్యతా ప్రమాణాలు, మేత యాజమాన్యం, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులుపై వివరించారు. మత్స్య అభివృద్ధి అధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘం నిర్వహణపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ నాగేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటసాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవాశిబిరం

ఘంటసాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని శనివారం ఘంటసాలలో ప్రారంభించారు. శ్రీ సాయి మినీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి.సంధ్యారాణి, డాక్టర్ జి.విజయ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడుగొర్రెపాటి వెంకట రామకృష్ణ, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి 12వ తేదీ వరకు గ్రామంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు వివరించారు. డాక్టర్ రేవతి, డాక్టర్ ఏ.జె. సువర్ణ లత, రిటైర్డ్ హెచ్ఎం పోతన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.